క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్

ముత్తారం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో కలికోట శ్రీనివాస్ అన్నారు. స్వచ్ఛ శుక్రవారంలో భాగంగా మండలంలోని అడవిశ్రీరాంపూర్, పోతారం గ్రామాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వీధుల వెంట తిరుగుతూ ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇంటింటికీ తడి, పొడి చెత్తను వేరుచేయాలని సూచించారు. ఆయన వెంట సర్పంచ్‌లు తుంగాణి సమ్మయ్యయాదవ్, నెత్తెట్ల మహేందర్ యాదవ్, ఉప సర్పంచ్ మద్దెల దివాకర్, ఎంపీవో భైరి వేణు మాధవ్ తదితరులు ఉన్నారు.

రోడ్ల నిర్మాణంతో పల్లెలు అభివృద్ధి



రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీపీ

జూలపల్లి: గ్రామాల్లో రోడ్ల నిర్మాణంతో రవాణా సౌకర్యం మెరుగు పడి సత్వర అభివృద్ధి చెందుతాయని ఎంపీపీ రమాదేవి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని 8వ వార్డులో పంచాయతీ నిధులు రూ. 10లక్షలతో సీసీరోడ్డు నిర్మాణానికి సర్పంచ్ నర్సింహయాదవ్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం ఎక్కువ ప్రాధాన్యత నిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మహేశ్,కార్యదర్శి లచ్చయ్య, వార్డు సభ్యులు సతీష్,అంకూస్, భరత్,మేరుగు శ్రీనివాస్,రమేశ్ తదితరులు ఉన్నారు.

పనులు వేగవంతం చేయాలి

ముత్తారం: మన ఊరు బడి పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో కలికోట శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని పోతారం ప్రభుత్వ పాఠశాలలో జరిగే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మన ఊరు మన బడి పనుల్లో నాణ్యత పాటించడంతో పాటు పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఆయన వెంట సర్పంచ్ నెత్తెట్ల మహేందర్ యాదవ్, ఎంపీవో వేణు మాధవ్, కార్యదర్శి జీవన్‌తో పాటు తదితరులు ఉన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం



పనులు పరిశీలిస్తున్న కౌన్సిలర్

పెద్దపల్లిరూరల్: ఇంటి ఆవరణతో పాటు పరిసర ప్రాంతాలను కూడా శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరి చేరవని 8వ వార్డు కౌన్సిలర్ బొంకూరి భాగ్యలక్ష్మి అన్నారు. ఇంటి ముంగిట కౌన్సిలర్ నినాదంతో వార్డులో ప్రతి శుక్రవారం స్వచ్ఛత కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అలాగే 8 వార్డులోనూ కౌన్సిలర్ ఎరుకల కల్పన స్వచ్ఛభారత్ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. డ్రెయినేజీలను, కచ్చకాలువలను శుభ్రం చేస్తూ దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకుంటున్నారు.

సెల్‌ఫోన్ ట్యాపింగ్‌పై ఎస్సైకి ఫిర్యాదు

మంథని: బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సెల్‌ఫోన్ ట్యాపింగ్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ నియోజకవర్గ కమిటీ నాయకులు శుక్రవారం మంథని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు పెగసస్ కంపెనీ నుంచి హెచ్చరికలు వస్తున్నాయన్నారు. ఫోన్ ట్యాపింగ్ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చేస్తున్నాయా లేదా ఇతరులు చేస్తున్నారా డీజీపీ స్థాయిలో సమగ్ర విచారణ చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జీలు జనగామ రవికుమార్, కందుగుల రాజన్న, నాయకులు రాకేశ్ నాగరాజు, జబాపు, రాజ్‌కుమార్, అజయ్ కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఎలిగేడు: మండలంలోని ధూళికట్టలో శుక్రవారం కేసీఆర్ సేవాదళం క్యాలెండర్‌ను సర్పంచ్ కావేరి, కేసీఆర్ సేవాదళం జిల్లా అధ్యక్షుడు దండె వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధానకార్యదర్శి వాతళ్ల కాంతయ్య, మండల అధ్యక్ష,కార్యదర్శులు బింగి రాజు, రాయనవేని శ్రీనివాస్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో తార, రాజు, పరుశరాములు తదితరులు పాల్గొన్నారు.

హమాలీల బతుకు భారం..

- రెండు నెలలు మాత్రమే ఉపాధి..
- పది నెలలు ఇంటి వద్దనే..
- సీజనల్ పనులతో కడుపునింపుకుంటున్న వైనం..



కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం వేస్తున్న హమాలీలు

ముత్తారం: గ్రామాల్లో పని చేసే హమాలీలకు సీజనల్ వ్యాపారాలు బతుకు నింపుతున్నాయి. సంవత్సరంలో రబీ, ఖరీఫ్ సీజన్‌లో కొనుగోలు కేంద్రాల్లో రెండు నెలల పాటు ఉపాధి పొందుతూ మిగతా పది నెలలు అడపా,దడపా గ్రామాలకు వచ్చే ఫెర్టిలైజర్, సీడ్ బస్తాలు, సిమెంట్ బస్తాలు లోడింగ్ అన్‌లోడింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నారు. రెండు నెలలు పనిచేస్తే పది నెలలు ఇంటి వద్దనే ఉండాల్సి వస్తుందని హమాలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండు నెలలు మాత్రమే ఉపాధి..

చాలా మందికి గుంట భూమి లేక కుటుంబ పోషణ కోసం ఎదో పని చేయడం కోసం కొంత మంది పేదవారు గ్రామాల్లో హమాలీలుగా పని చేస్తున్నారు. ప్రతి ఏటా ఖరీఫ్, రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రెండు నెలల పాటు మాత్రమే ఉపాధి లభిస్తోంది. మిగిలిన సమయంలో పనులు లేకపోవడంతో వ్యవసాయ పనులకు కూలీలకు వెళ్లి కుటుంబాలను పోషిస్తున్నామని హమాలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అనారోగ్యం పాలైతే అంతే..

హమాలీలు ఏదైనా అనారోగ్యానికి గురైతే కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వస్తుందని వాపోతున్నారు. సీజన్‌లో పనిచేస్తేనే కుటుంబం గట్టెక్కే పరిస్థితి లేదని ఇక మంచాన పడితే కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని వాపోతున్నారు.

సగం సంపాదన చదువులకే..

హమాలీలు ప్రతి ఏటా సంపాదించిన సంపాదనలో సగం వరకు తమ పిల్లలకు చదువులకు ఖర్చు చేస్తున్నారు. తమలాగా తమ పిల్లలు కష్టపడ వద్దు అనే ఉద్దేశ్యంతో తమ పిల్లలను చదివించడం కోసం వస్తులుండాల్సి వస్తుందని వాపోతున్నారు.

తగ్గిన శ్రమ..

కొనుగోలు కేంద్రాల్లో ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలతో ధాన్యం కొనుగోలు చేస్తుండడంతో కొంత వరకు శ్రమ తగ్గింది. గతంలో సాధారణ కాంటాల్లో తూకం వేయాలంటే కాంటాలను మోసుకెళ్లడానికి ఇబ్బంది పడేవారు. ఇప్పుడు దాదాపు ఎక్కువగా ఎలక్ట్రానిక్ కాంటాలతోనే తూకం వేస్తున్నారు.

హెల్త్ కార్డులు ఇవ్వాలి..

లారీల్లో బస్తాలు లోడింగ్, అన్‌లోడింగ్ చేసే హమాలీల జీవితానికి భరోసా కరువైంది. పని చేసే సమయంలో ఎదైనా ప్రమాదం జరిగితే కనీసం పట్టించుకునే వారు లేరు. ప్రతి ఏటా ఉదయం నుండి రాత్రి వరకు ధాన్యం బస్తాలు తూకం వేస్తున్నారు. చాలా మంది హమాలీలు అనారోగ్యం బారిన పడుతున్నామని హెల్త్ కార్డులు ఇచ్చి తమ బ్రతుకుకు భరోసా ఇవ్వాలని హమాలీలు కోరుతున్నారు.

హమాలీ పనే ఆధారం



గ్రామాల్లో పనులు లేక హమాలీ పని చేసుకుంటూ బ్రతుకుతున్నాం. వచ్చిన డబ్బులు సరిపోక కుటుంబ పోషణ కోసం భారమవుతోంది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం బస్తాలతో పాటు గ్రామానికి వచ్చిన సిమెంట్, మందు బస్తాలు రేషన్ బియ్యం లోడింగ్ అన్‌లోడింగ్ చేస్తాం పని లేని సమయంలో కూలీ పనులకు వెళతాం. రెండు నెలలు పని చేసి పది నెలలు ఇంటి వద్ద ఉండాల్సి వస్తుంది.

– రౌతు రాజు, హమాలీ,ముత్తారం

హెల్త్ కార్డులు ఇవ్వాలి..



పని చేసే సమయంలో చాలా మంది హమాలీలు గాయాల పాలవుతున్నారు. ఎక్కువ బరువులు మోయడం వలన చాలా మంది అనారోగ్యం పాలవుతున్నారు. సరైన ఉపాధి లేక హమాలీలుగా పని చేస్తున్నాము. చాలా మందికి హెల్త్‌కార్డులు లేవు. ఎవరైనా అనారోగ్యం బారిన పడితే అంతే సంగతి. చాలా ఇబ్బందులు పడుతున్నాము. హమాలీలకు ప్రభుత్వం హెల్త్ కార్డులు ఇవ్వాలి.

– సుంకిడ్ల శంకర్, హమాలీ, ఖమ్మంపల్లి

అసత్యాలు నమ్మొద్దు

- ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

సుల్తానాబాద్: కొన్ని పార్టీల నాయకులు అసత్యాలు మాట్లాడుతూ ప్రజలను రెచ్చగొట్టే విధానాల్లో ఉన్నారని అలాంటి వారిని నమ్మవద్దని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని సాయిరాం గార్డెన్‌లో పట్టంలోని గుడిమిట్టపల్లికి చెందిన పలువురు యువకులు కనవేని సతీశ్‌యాదవ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలాజీరావు, మండల పార్టీ అధ్యక్షుడు పురం ప్రేమ్ చందర్‌రావు, ఏఎంసీ చైర్మన్ బుర్ర మౌనిక, శ్రీనివాస్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు పారుపల్లి గుణపతి, బండారి స్రవంతి, వెంకట్‌రెడ్డి,వైస్‌చైర్మన్ మహిపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీల ధర్నా



నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

పెద్దపల్లిరూరల్: ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలుగా పనిచేస్తున్న వారికి ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫార్సుల ప్రకారం వేతనాలివ్వి, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోతి డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్ద శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలతో కలిసి నిరసన చేపట్టారు. అనంతరం ఏవో ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలకు ఉపయోగపడే పథకాలను నీరు గారుస్తోందని ఆరోపించారు. 30 ఏళ్లుగా సేవలందిస్తున్న అంగన్‌వాడీలకు చట్టబద్ధ సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కమలేశ్, వనజారాణి, రామలక్ష్మి, శోభ, ఉమారాణి, భాగ్య, కనకలక్ష్మి, తులసమ్మ పాల్గొన్నారు.

‘ఎంఎండీఆర్-15’ రద్దుకు ఉద్యమించండి

- సింగరేణి అస్తిత్వాన్ని దెబ్బతీసేందుకు కేంద్రం కుట్ర
- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని(రామగుండం): కేంద్ర ప్రభుత్వం ఎంఎండీఆర్-15 యాక్టుతో సింగరేణి అస్తిత్వాన్ని దెబ్బతీసేందుకు కుట్ర చేస్తోందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆరోపించారు. తెలంగాణకు కొంగుబంగారంగా నిలుస్తున్న బొగ్గు బ్లాకులను విక్రయించి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా చేయాలని చూస్తోందన్నారు. శుక్రవారం ఆర్జీ-1 ఏరియాలోని జీడీకే-2ఏ, ఏరియా వర్క్‌షాపుల్లో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లలో మాట్లాడారు. అంతకుముందు కనకదుర్గాదేవి పల్లకిసేవలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశానికి వెలుగునిస్తున్న సింగరేణి కార్మిక జీవితాల్లో చీకట్లు అలుముకుంటున్నాయని అన్నారు. అందుకే కేంద్ర ప్రభుత్వం చేసిన ఎంఎండీఆర్-15 యాక్టు వ్యతిరేకిస్తూ సింగరేణి పోరుదీక్ష చేపట్టానని తెలిపారు. కార్మికులందరూ ఏకమై, ఈ యాక్టును రద్దు చేసేవరకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాబోయే పార్లమెంటు సమావేశాల్లో దీన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, రాష్ట్ర నాయకురాలు మూల విజయారెడ్డి, టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య, నాయకులు జాహిద్ పాషా, దాసరి నర్సయ్య, ఎల్.వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిత్య యోగాసాధనతో ఆరోగ్యకర జీవితం

- ఎమ్మెల్యే కోరుకంటి చందర్



సన్మానిస్తున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: నిరంతర యోగా సాధనతో ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందవచ్చని, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయ బెస్ట్ యోగా మాస్టర్ అవార్డు గ్రహీత, యోగరత్న సుధాజీ ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి ఎమ్మెల్యే చందర్ గారు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. యోగా సాధనతో శారీరక, మానసిక రుగ్మతలను దరిచేరనీయదని, అందుకే ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో యోగా సాధనను అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని ప్రజానీకానికి నిస్వార్థంగా యోగాను నేర్పిస్తున్న సుధాజీ ఔన్నత్యాన్ని ఎమ్మెల్యే కొనియాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు మూల విజయారెడ్డి, కార్పొరేటర్లు బాల రాజ్‌కుమార్, కన్నూరి సతీశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గాండ్ల తిలకుల క్యాలెండర్ ఆవిష్కరణ

గాండ్ల తిలకుల సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ శుక్రవారం ఆవిష్కరించారు. కుల సంఘ సభ్యులంతా ఐక్యంగా ఉండి సంఘాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పెద్దపెల్లి జిల్లా అధ్యక్షుడు సంగెం రవి, వర్కింగ్ ప్రెసిడెంట్ చందా చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి సంగెం నగేశ్, నియోజకవర్గ అధ్యక్షుడు బొల్లం ఉమాశంకర్, పిల్లలమర్రి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడదాం

- మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు



సమావేశమైన విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజలను చైతన్య పర్చేందుకు ఈనెల 11 నుంచి గడపగడపకు కాంగ్రెస్ పార్టీ నినాదంలో ఇంటింటికి వెళ్లనున్నట్లు మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. పెద్దపల్లిలో శుక్రవారం ముఖ్య నాయకులతో సమావేశమై పలు అంశాలపై మాట్లాడారు. ప్రజలంతా పాలకుల తీరుపై విసుగు చెంది ఉన్నారన్నారు. ఇంటింటి కి వెళ్లి కాంగ్రెస్ పాలనలో అందిన పథకాలను వివరించడంతో పాటు ప్రస్తుత పాలకులు సాగిస్తున్న అవినీతి ఎండగట్టాలన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ను గెలిపించేలా ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు. సమావేశంలో నాయకులు వేముల రామ్మూర్తి, సునీల్‌గౌడ్, చందు, శ్రీమాన్, సంపత్, సుభాష్, అవినాష్, వీరేశం, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంకు సాధించాలి



సమీక్షలో మాట్లాడుతున్న కమిషనర్ సుమన్‌రావు

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ స్వచ్ఛ సర్వేక్షణ్-2023 పోటీలో మంచి ర్యాంక్‌ను సాధించడానికి అధికారులు, సిబ్బంది మరింత ఎక్కువ సేవలందించాలని మున్సిపల్ కమిషనర్ బి.సుమన్‌రావు ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం తన చాంబర్‌లో డిప్యూటీ కమిషనర్ నారాయణరావుతో కలిసి శానిటేషన్, మెప్మా విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంక్‌ను సాధించడమే లక్ష్యంగా నగరంలోని ఇంటింటి నుంచి చెత్త సేకరణ చేపట్టాలని సూచించారు. సంపూర్ణ పారిశుధ్య నిర్వహణకు డీఆర్‌సీసీ నిర్వహణ, కంపోస్టు తయారీ, పౌరుల నుంచి అభిప్రాయాలను సేకరించడం తదితర అంశాలపై కమిషనర్ అవగాహన కల్పించారు. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్యాం, నాగభూషణం, సునీల్, సూపర్‌వైజర్లు, మెప్మా సీఓలు పాల్గొన్నారు.

సాంకేతికతను వినియోగించుకోవాలి



పత్రాలు అందిస్తున్న కోటేశ్వర్‌రావు

పెద్దపల్లిరూరల్: శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా యువత పరిజ్ఞానాన్ని పెంచుకుని అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కోటేశ్వర్‌రావు అన్నారు. పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆవరణలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కార్మికుల పిల్లలకు ఉచిత శిక్షణ సర్టిఫికెట్లను అందజేశారు. ప్రతిభ, నైపుణ్యాలను పెంపొందించుకున్న వారికే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. స్వయం ఉపాధి, వృత్తి, నైపుణ్య శిక్షణను కార్మిక శాఖ ఇప్పిస్తోందన్నారు. సెట్విన్, భవన నిర్మాణ కార్మికశాఖ సంయుక్తంగా 26 కోర్సుల్లో యాప్ ద్వారా ఉచిత ఆన్‌లైన్ శిక్షణ అందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఎల్‌ఓలు శ్రీకాంత్, రామ్మోహన్, అధ్యాపకులు సంజీవ్ తదితరులున్నారు.

సంధ్య అత్తింటివారిపై వరకట్నం కేసు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని కూనారం గ్రామంలో వరకట్నం వేధింపులకు గురై ఆత్మహత్య చేసుకున్న బొట్ల సంధ్య కేసులో అత్తింటి వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. ఈనెల 4న సంధ్య ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఘటన స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ సారంగపాణి, సీఐ ఇంద్రసేనారెడ్డి, తహసీల్దార్ అనుపమరావు బాధితుల నుంచి తీసుకున్న వాంగ్మూలంతోపాటు మృతురాలి తండ్రి రాజేందర్ ఈనెల 5న ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంధ్య ఆత్మహత్యకు కారణమైన బొట్ల రమాదేవి(అత్త), సదానందం(మామ), శ్రీకాంత్(భర్త)పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎస్సైపై మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు

ఓదెల: ఓదెల గ్రామానికి చెందిన రైతు, మాజీ ఎంపీటీసీ బొడకుంట శంకర్ పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ ఎస్సైపై మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశాడు. సివిల్ వివాదంలో స్టేషన్‌కు పిలిచి రోజంతా అకారణంగా ఉంచి మానసికంగా వేధిస్తున్నాడని ఎస్సైపై ఫిర్యాదులో పేర్కొన్నాడు.

గీత కార్మికుడికి గాయాలు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేట గ్రామానికి చెందిన మేర్గు లక్ష్మిపతిగౌడ్ అనే గీత కార్మికుడు శుక్రవారం ప్రమాదవశాత్తు ఈత చెట్టుపై నుంచి పడడంతో పలుచోట్ల బలమైన గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి గోదావరిఖని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రైలు మార్గంలో నల్లబెల్లం సరఫరా

గోదావరిఖని: గుడుంబాకు ఉపయోగించే ముడిపదార్థాల సరఫరాకు నిందితులు రైలుమార్గం ఎంచుకున్నారని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మహిపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం రామగుండం ఎక్సైజ్‌స్టేషన్‌లో మాట్లాడారు. మహారాష్ట్రలోని రాజురా తాలూకా వీరు గ్రామం నుంచి పటిక, నల్లబెల్లం తీసుకవస్తున్నారనే సమాచారం మేరకు రాఘవాపూర్ రైల్వేస్టేషన్ సమీపంలోని మూడు ద్విచక్ర వాహనాలపై తీసుకువస్తున్న బెల్లం, పటికను పట్టుకున్నట్లు తెలిపారు. ఇద్దరు పరారు కాగా దొంతి వంశీ పట్టుబడ్డాడన్నారు. మిగతా ఇద్దరు పల్లపు సంతోష్, సంపంగి కుమార్ పరారైనట్లు వెల్లడించారు. వీరివద్ద నుంచి మూడు ద్విచక్ర వాహనాలు, 150 కిలోల పటిక, 100 కిలోల బెల్లం స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. సమావేశంలో జిల్లా ఏఈ తుక్యానాయక్, రామగుండం ఎక్సైజ్ సీఐ రమేష్, డీటీఎఫ్ సీఐ వినోద్, ఎస్సై విజయభాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

కాకతీయ దూర విద్యా కేంద్రాలను కొనసాగించాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

గోదావరిఖనిటౌన్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కాకతీయ దూర విద్యా కేంద్రాలను కొనసాగించాలని ఉన్నత విద్యాశాఖ మంత్రి లింబాద్రిని ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంపెల్లి సతీశ్, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి మద్దెల దినేశ్ శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గత 25 ఏళ్లుగా పూర్వ విద్యార్థులు ఎంతో మంది విద్యనభ్యసించారని యూజీసీ తీసుకొచ్చిన నిబంధనతో గత మూడేళ్ల నుంచి దూర విద్యా కేంద్రంను నడపడం లేదని దీంతో చాలా మంది పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో గద్దం శ్యాంకుమార్ గౌడ్, జెట్టి రాము, పాయిల సాగర్, శివకుమార్,శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కళాకారులకు గ్రామస్తుల సన్మానం

ముత్తారం: మండలంలోని అడవిశ్రీరాంపూర్ గ్రామానికి చెందిన సాయి మారుతి కళామండలి బృందంను సర్పంచ్ తుంగాణి సమ్మయ్య, ఎంపీటీసీ దొడ్డ గీతారాణి గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. మారుతి కళామండలి వ్యవస్థాపకులు గోసుకుల కొమురయ్య చిత్రపటానికి కళాకారులు క్షీరాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇటీవల హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన ఉత్తర అమెరికా తానా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన బహుజన కళా మహోత్సవంలో యక్షగానం ప్రదర్శనలో మొదటి స్థానం నిలిచి, అమెరికాలో జరిగే మహోత్సవాలకు ఎంపికయినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాకారులు కూనూరి సత్యనారాయణ, దుబాసి శ్రీనివాస్, గోస్కుల రమేశ్ పాల్గొన్నారు.

చెక్కు అందజేత

ధర్మారం: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన ముత్తినేని చిన్నయ్య ప్రమాదవశాత్తు మరణించగా, యూనియన్ బ్యాంక్ సబ్ మేనేజర్ సందీప్‌కుమార్ శుక్రవారం రూ. 2 లక్షల బీమా చెక్కును ఆయన కుమారుడు వినయ్‌కు అందించారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

రామగిరి: మండంలోని బేగంపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనాన్ని శుక్రవారం ఎంపీపీ ఆరెల్లి దేవక్క, మండల ప్రత్యేక అధికారి సాయినాథ్ పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు గత కొద్ది రోజుల నుంచి నిర్వాహకులు వంటలు సరిగా చేయడం లేదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎంపీపీకి ఫిర్యాదు చేయగా వారి స్వయంగా వెళ్లి భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మంచి రుచికరమైన వంట చేసి పెట్టాలని నిర్వాహకులకు సూచించారు. వారి వెంట డీఎల్‌పీవో రాంబాబు, ఎంపీడీవో రమేశ్, సర్పంచ్ బుర్ర పద్మ తదితరులు ఉన్నారు.

పారిశుధ్యం నిర్వహణపై నిర్లక్ష్యం చేయొద్దు

కమాన్‌పూర్: గ్రామాల్లో పారిశుధ్యంపై అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం చేయవద్దని మండల ప్రత్యేక అధికారి రవూఫ్ అన్నారు. మండలంలోని పేరపల్లిలో శుక్రవారం నిర్వహించిన డ్రైడే పనులను పరిశీలించారు. గ్రామాల్లో ప్రతి రోజు చెత్తాచెదారం తొలగించాలని, హరితహారంలో నాటిన మొక్కలకు ప్రతి వారం నీరుపోయాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎంపీవో ఆరిఫ్, సర్పంచ్ తొగరి అన్నపూర్ణ, పంచాయతీ కార్యదర్శి రాజ్యలక్ష్మి ఉన్నారు.

గుంతలు పూడ్చివేత

సుల్తానాబాద్: గుంతల మయమైన రోడ్డును సొంత ఖర్చులతో రెడ్ మిక్స్ కంకర తీసుకుని శ్రమదానంతో నల్ల ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నల్ల మనోహర్ రెడ్డి బాగు చేశారు. పట్టణంలోని శ్రీరాంపూర్ చౌరస్తా నుంచి యాదవ్ నగర్ వరకు రహదారి వెంబడి గుంతలు పడడంతో ప్రయాణికులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకుని రోడ్డు బాగు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఎవరికి ఏ అవసరం వచ్చినా తనను సంప్రదించాలన్నారు. మాజీ జెడ్పీటీసీ ఏల రమేశ్ మాట్లాడుతూ వాహనదారులకు ఇబ్బంది కలుగకుండా రోడ్డు మరమ్మతు చేయించినందుకు అభినందించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వడాల శ్రీరాములు గౌడ్ బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు

భావితరాలకు బహుమతిగా సంప్రదాయాలు

రామగిరి: భావితరాలకు మన సాంప్రదాయలను బహుమతిగా అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సింగరేణి డైరెక్టర్(డైరెక్టర్ ఆపరేషన్స్-పా) ఎస్. చంద్రశేఖర్ సతీమణి పల్లవి ఆకాంక్షించారు. సింగరేణి సంస్థ ఆర్జీ-3, ఏపీఏ ఏరియాల లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం సెంటినరీకాలనీలోని సీఎస్‌సీవోఏ క్లబ్‌లో లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు తన్నీరు శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించిన బొమ్మల కొలువులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భావితరాల వారికి కూడా మన సంస్కృతీ, సాంప్రదాయల గురించి తెలియజేస్తుందన్నారు. కార్యక్రమంలో వివిధ ఏరియాల లేడీస్ క్లబ్ ప్రెసిడెంట్లు కళ్యాణి, పద్మ, సవితా,రాధ, లక్ష్మి, స్వరూపరాణి, మాంతి, ప్రియదర్శిని, లేడీస్ క్లబ్ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చని బీఆర్ఎస్

ధర్మారం: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేని బీఆర్ఎస్ పార్టీ ప్రజలను మాయమాటలతో మోసం చేస్తోందని జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్ ఆరోపించారు. ధర్మారంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన రుణమాఫీ హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. మేడారంలో గంగపుత్రులను, ముదిరాజ్‌లను ఆదుకుంటామని హరీశ్‌రావు ఇచ్చిన హామీ మరిచిపోయి మత్స్య సంపదను పెంచుతున్నామని చెప్పటం సరికాదన్నారు. చామనపల్లి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ప్రకటించి డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టిస్తామని చెప్పి మోసం చేసిన సంగతి ప్రజలు మరిచిపోరన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్, నాయకులు రేండ్ల నరేశ్, కాంపెల్లి రాజేశం, అరిగే లింగయ్య, సిరికొండ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.